అమృత్‌కిరణ్ కథలపోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ (250/-)

# లలాట లిఖితం

-కాకాని కమల

**చు**క్కమ్మ పరిస్థితి చావు బతుకుల్లో ఉంది.

మరణశయ్యలో ఆఖరి గడియలు లెక్కపెడుతూంది.

గొర్రె తలనరికి మొండెంనుంచి వేరుచేసినా ఇంకా కాళ్ళు కొట్టుకుంటున్నట్లు...

చుక్కమ్మ బొందిలో ఏమూలో కొనఊపిరి ఆడుతూంది.

జీవుడులో ఎవరి కోసమో కొట్టుకొంటూంది.

చుక్కమ్మ కళ్ళు తెరిచే ఉన్నాయి.

కాని చూపు ఆనటం లేదు.

సగం గొంతు తెగిన కోడిలా గురగురా అన్న చిన్న శబ్దం నోట్లోంచి వస్తూంది.

కాళ్ళు చేతులు పక్షవాతం వచ్చినట్లు చచ్చుపడి పోయాయి.

బలహీనంగా నాడి కొట్టుకొంటోంది.

కుక్కిబడ్డ నులకమంచంలో పాతచింకి బట్టల మూటలా పడిఉంది చుక్కమ్మ.

డాక్టరు వచ్చి పరీక్ష చేసి పెదవి విరిచాడు.

"ప్రాణం పోయినట్లే లెక్క. కాని ఎవరికోసమో జీవుడు కొట్టుకొంటోంది. ఆ మనిషి ఎవరో... వస్తే ప్రాణం పోతుంది. ఇంకా కొన్ని గంటలు లేదా, రోజులు ఇలాగే ప్రాణం కొట్టుకొని పోతుంది." అన్నాడు డాక్టర్.

అమాట నిజమే.

చుక్కమ్మని చూస్తే సమాధిలోంచి శవాన్ని తీసినట్లుందిగాని బతికున్నట్లు అనిపించటం లేదు. ఎప్పుడో పోవలసిన ప్రాణం. కాని పట్నంలో ఉన్న కొడుకు కోసం ఆ ముసలి తల్లి ప్రాణం అల్లాడుతూంది.

పట్నం వెళ్ళి నాలుగు రోజులు అయ్యింది కొడు కు జాడ లేదు.

కనీసం వస్తున్నాడో రాడో కూడా తెలియదు. కాని ఇక్కడ చుక్కమ్మ పరిస్థితి చావుకీ- బ్రతుక్కీ మధ్య అల్లాడుతూంది. మంచంలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నందుకేమో విపరీతమైన వాసన. ఈగలు జొయ్యిని ముసురుతున్నాయి.

తిండిమాట సరే... ఎలాగూలేదు... నోట్లో నీళ్ళు పోసినా మింగుడు పడటంలేదు. సగం తెరుచుకొన్న చుక్కమ్మ నోట్లోంచి ఈగలు లోపలికి పోయి బయటికి వస్తున్నాయి. దవడ ఎముకలు బిగుసుకు పోయాయి.

కొడుకంటే పంచ ప్రాణాలు చుక్కమ్మకి. "అమ్మా" అన్న పిలుపు కోసం ఆ జీవుడు కొట్టుకుంటోంది.

రాని కొడుకు కోసం ఎదురుచూస్తూ మంచంలో పడిఉంది చుక్కమ్మ.

గంటకో అరగంటకో ఇరుగుపొరుగు వచ్చి చూసి వెళుతున్నారు


కుక్కలూ పందులూ గుడిసెలోకి పోకుండా సగం విరిగిన చెక్క తలుపుని బయట నుండి గెడియ వేస్తున్నారు.

చూస్తూ ఉండగానే వారం గడిచిపోయింది.

చుక్కమ్మ పరిస్థితిలో మార్పు లేదు.

పట్నంలో ఉన్న వెంకటరమణ మాత్రం ఇంకా తల్లిని చూడటానికి రాలేదు. అసలు వీళ్ళు పంపిన తంతి అందిందో లేదోనని ఇంటి ఎదురుగా ఉన్న నాయిడు పోస్టాఫీసుకి వెళ్ళి పోస్టుమాస్టర్ చేత వెంకట రమణకి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ పంపించాడు.

చుక్కమ్మ గుడిసెలో తుప్పుపట్టిన పాత ఇనుప పెట్టెలో అడుగున ప్లాస్టిక్ కవర్‌లో వెంకటరమణ ఎడ్రస్



దొరికింది. కాగితం బాగా నలిగి మురికి ఓడుతూంది. కాని కాగితంమీద అక్షరాలు మాత్రం చెక్కు చెదరలేదు.

"... పత్తి వెంకట రమణ

కేరాఫ్ శ్రీలత ఇండస్ట్రీస్

బాంబే..."

అన్న అక్షరాలు మాత్రం నిన్న మొన్న రాసినట్లు ఇంకా తడి ఆరనట్లు స్పష్టంగా ఉన్నాయ్. ఆ కాగితం చూస్తే చుక్కమ్మకి కొడుకు మీద ఎంత ప్రేమో తెలుస్తూంది.

చుక్కమ్మది బాల్యవివాహం. పెళ్ళయిన నాలు గేళ్ళ కే మగడు చనిపొయ్యాడు. అప్పటికి ఒళ్ళో ఆర్నెల్ల పసివాడు వెంకటరమణ. చుక్కమ్మది పదు నెనిమి దేళ్ళ వయసు. భర్తది వ్యవసాయం. రెక్కల కష్టంతో కొడుకుని పెంచి పెద్ద చేసింది.

"నీ కొడుకు దొర. ఆడి నాన్నలా పేడ పిసుక్కుం టూ



బురదలో బతక కూడదు. సీమ దొరలా కార్లల్లో తిరగాలి. ఆణ్ణి బాగా పెద్ద సదువులు సదివిస్తాను. నా పానం అరగి దీసన్న సరే ఆణ్ణి కలకటేర్ చేస్తాను" అంటూ అందరికి చెప్పేది చుక్కమ్మ.

కొడుకు పెద్ద స్కూలు నుంచి కాలేజీకి వచ్చేసరికి చుక్కమ్మకి డబ్బు ఇబ్బందులు మొదలయ్యాయి. "పొలం పన్లు ఉన్ననాడు ఉంటయ్యి లేనినాడు లేవు" అనుకుని గుడిసెయందు చిన్న దుకాణం తెరిచింది.

కాళ్ళ కున్న వెండి కడియాలు అమ్మి సరుకులు తెచ్చింది. జీళ్ళు, మురుకులు, బెల్లం లడ్డు, చాకలెట్లు, పలకలు, బలపాలు, బూరలు, చిన్న చిన్న ఆట వస్తువులు, బొంగరాలు, గోళీలు... ఇలాంటివన్నీ దుకాణంలో అమర్చింది.

ఎలిమెంటరీ స్కూలు దగ్గరుండటంతో పిల్ల లంతా వచ్చి కొనుక్కునేవారు.

అది రమణకి ఇష్టంలేదు -తల్లి అలా చేస్తూంటే తన స్నేహితులంతా నవ్వుతున్నారనీ, ఆక్షేపిస్తున్నారనీ తల్లితో గొడవ పడేవాడు.

కాని చుక్కమ్మ కొడుకు మాటలు చిన్నతనం చేష్టలుగా తీసిపారేసేది.

"ఆళ్ళు నవ్వితే మనకేంటిరా? ఆళ్ళ పళ్ళే బయట పడతయ్యి గందా? అసలలాంటివన్ని కాతరు చేస్తే మనకి ఒరిగేదేంటి? మన అక్కరలు ఆళ్ళు తీరుస్తారా? నీ పట్నం చదువుకి అయ్యే కరుసులు ఆళ్లు బరాయిత్తారా? మన బాధలు మనం పడాలి" అనేది. అయినా వెంకటరమణ తరచూ తల్లితో ఈ విషయంలో గొడవపడేవాడు. సెలవు రోజుల్లో కూడా "నేనట్టా ఊళ్ళోకి పోయొస్తా కాస్సేపు ధుకాణం మీద కూసోరా వెంకటి." అంటే వినేవాడు కాదు..

"కుర్ర సన్నాసి నాజూకు మడిసి" అని నవ్వుకునేది.

వెంకటరమణ తల్లికోరిక ప్రకారం ఎప్పుడూ చదువుల్లో ఫస్టునే ఉన్నాడు. ర్యాంకు సంపాదించుకుని స్కాలర్ షిప్పులు పొందేవాడు. కాని చదువుకితగ్గ వివేకం అబ్బలేదు. అహంకారం అబ్బింది. పట్నంలో పెద్దింటి పిల్లల్తో స్నేహాలు మొదలయ్యాయి. దాంతో పేదరికం అంటే చిన్నచూపు. ఒకరకమైన అహం, అభిజాత్యం మొదలయ్యాయి.

తను గొప్ప సంప న్నుడు కావాలన్న కోర్కె పడగలు విప్ప సాగింది. గొప్పింటిస్నేహితులకి నోట్సులు రాసి పెట్టి పరీక్షల్లో పేపరు చూపించి, బిట్సు తయారు చేసి ఇచ్చి వాళ్ళ ప్రాపకం సంపాయించుకున్నాడు. వాళ్ళు ఆర్థికంగా సాయం చేసేవారు.

ఇంటిదగ్గర్నుంచి తల్లి పంపే డబ్బుకి స్నేహితుల సహకారం తోడుకావటంతో పట్నంలో ఉండి పెద్ద చదువు పూర్తి చేశాడు. పట్నంలో ఒక గొప్పింటి అమ్మాయిని ప్రేమించి ఇంటల్లుడిగా ఉండి పోయాడు.

భార్య పేర్న ఉన్న శ్రీలత ఇండస్ట్రీస్‌కి ఇప్పుడు అతనే యజమాని. లక్షాధికారి. వ్యవహార జ్ఞానం ఉన్న మామగారి సలహాలతో ఇప్పుడు వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంది.

వాళ్ళకి కొడుకైనా అల్లుడైనా వెంకట రమణే. రాను రానూ మామగారు వృద్ధుడు అవటంతో పూర్తిగా వ్యాపారంలో మునిగి ఊపిరి తీసుకుందుకు కూడా వీలుచిక్క నంతగా బిజీ అయిపోయాడు వెంకటరమణ.

ఫలితంగా పల్లెటూర్లో జీళ్ళు అమ్ముకునే తల్లిని పూర్తిగా మరిచి పోయాడు రమణ.

ఆ దుకాణం మూసెయ్యమని చాలా సార్లు చెప్పాడు.

చుక్కమ్మ వినలేదు.

తల్లిని తన దగ్గరకి వచ్చెయ్య[illegible].

చుక్కమ్మకి వయసుడిగి పోయింది. ఇది వరకులా కూలీనాలీ చేసే శక్తిలేదు. దుకాణం సరిగా చూసుకోలేక పోతూంది. అందుకే అభిమానం చంపుకుని ఇల్లరికం వెళ్ళిన కొడుకు దగ్గరకే వెళ్ళి కొన్నాళ్ళుంది.

కాని ఇమడలేక పోయింది.

కోడలి అహంభావం, కొడుకు నిరసన చుక్కమ్మ నిజాయితీని హత్య చేశాయి.

దాంతో తిరిగి పల్లెకి వచ్చేసింది.

ఊహతెల్సిన దగ్గర్నుంచి కష్టపడి బతికింది. 'దేహీ' అని ఎవ్వర్నీచెయ్యి చాచలేదు. కోడలు మోచేతి గంజి తాగలేక పోయింది.

"నీకు తల్లిగావాల్నంటే నాతానకి రా. డబ్బే ఎక్కువ అనుకుంటే ఆణ్ణే ఉండు" అంది కొడుకుతో.

వెంకటరమణకి డబ్బే ముఖ్యం.

పేదరికం అంటే అసహ్యం.

చుక్కమ్మ పల్లెలో భర్త మిగల్చిపోయిన గుడిసె ఉంది. ఇంటిముందు దుకాణం ఉంది. వాటికి జతగా నాలుగు కోళ్ళని తెచ్చింది. జీవితం ఏదో... గడిచిపోతూంది.

కాని కొడుకు కంటికి దూరం అయ్యాడన్న బాధ లోలోన కృంగదీస్తుంది.

అస్తమానం కొడుకుని, మనవల్ని తలుచుకొని మురిసిపోతూంది. కొడుకుకార్లోనే తిరుగుతాడనీ మనవలు కార్లోనే బడికి వెళతారనీ, కోడలు ఇంట్లో కూడా సిల్కు చీరలు కట్టుకుని చెప్పులేసుకుని తిరుగుతుందని ప్రతి పనికి పనివాళ్ళేననీ, నాలుగు కుక్కల్ని పెంచారనీ... అస్తమానం సోది చెప్పినట్లు ఇరుగు పొరుగులకి చెప్తూంది.

"మనిషివంటే ఈడున్నావ్‌గాని, నీ పానం అంతా నీ కొడుకు దగ్గరే. అంత ప్రేమ ఉన్నప్పుడు ఆణ్ణే పోయి ఉండరాదా?" అనేవాళ్ళు ఇరుగు పొరుగు. కాని చుక్కమ్మ వెళ్ళలేదు.

కోడలి అహంకారం ముందు దీపంముందు శలభంలా చుక్కమ్మ మనసు మాడిపోతుంది. అప్పుడప్పుడు

చూడాలనుందని ఒకసారి వచ్చి వెళ్ళమని కొడుక్కి కార్డులు వేయించేది.

అవి వెంకటరమణకి అందాయోలేదో తెలియదు. కాని రమణ ఒక్కసారికూడా తల్లిని చూడటానికి రాలేదు. కనీసం జవాబు కూడా రాయలేదు.

చుక్కమ్మకి అరవైదాటాయి. పక్షవాతం ఒక ఊపు ఊపింది. రాను రాను తెగుళ్ళుపట్టి పోయి మంచం దిగలేని స్థితి వచ్చింది.

పట్నం కొడుకు దగ్గరికి వెళ్ళమని సలహా ఇచ్చారు. ఇరుగు పొరుగు.

కాని చుక్కమ్మ వెళ్ళలేదు. అసలు కదిలే స్థితిలో లేదు.

కొడుకు కోసం అని ముంతలో కూడబెట్టిన డబ్బును పైసాకూడా బయటికి తియ్యలేదు. గత పదిహేను దినాలుగా చుక్కమ్మ పరిస్థితి చాలా అధ్వాన్నంగా దిగజారిపోయింది. మనిషి కోమాలోకి పోయినట్టు మగతలోకి పోయింది.

ఒళ్ళంతా పక్షవాతం కమ్మి చచ్చుపడింది. కళ్ళు అరమూతలు పడ్డాయి.

దవడ ఎముకలు బిగుసుకుని నోరు తెరుచు కుంది. సగం గొంతు తెగిన కోడిలా ఆ నోట్లోంచి సరసరా శబ్దం వస్తూంది.

"ప్రాణం పోయినట్లే లెక్క. మహా అయితే కొన్ని గంటలు లేదా రోజులు అని డాక్టరు తేల్చి చెప్పాడు.

ఒకోసారి మనిషి జాగ్రదావస్థలోంచి గాఢ సుషుప్తి లోకి జారిపోతాడు. అటువంటప్పుడు ఆ మనిషి చనిపోయినట్లే లెక్క. అది ఒకరకమైన సమాధిస్థితి.

కాని ఆ స్థితిలో కూడా ఆ మనిషి బొందిలో జీవం ఏమూలో ఉంటుంది.



## ఆకారం

"మొన్నీ మధ్య నేను అడివిలోంచి వెళ్తూంటే నరమాంస భక్షకులు పట్టుకున్నారు" అన్నాడు సురేష్.

"మరి ఎలా తప్పించుకున్నారేమిటి?" అడిగాడు వంశీ.

"నా ఆకారాన్ని చూసి పొయ్యిలోకి కట్టెలు కూడా దండగని వాళ్ళే వదిలేశారు!" చెప్పాడు సురేష్.

-పి.వి.మురళీ కృష్ణ
ఇ.నం.16-11-418/3/2,
ఆంధ్రా లా టైమ్స్ దగ్గర
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్-500 036.

"వల్లమాలిన మమకారంతో ఎవరికోసమో ఎదురు చూస్తున్నప్పుడు అలా జీవుడు కొట్టుమిట్టాడు తాడట!" నల్గురుచేరి అనుకుంటున్న మాటలు అవి.


ఇప్పుడు చుక్కమ్మ సరిగ్గా ఆ స్థితిలోనే ఉంది.

చావుకీ - బ్రతుక్కీ మధ్య.

ఇరుగు పొరుగు వచ్చి చూసి వెడుతున్నారు.

పట్నంలో ఉన్న శ్రీలత ఇండస్ట్రీస్‌కి టెలిగ్రాములు వెళ్ళాయి.

మంచంలో చుక్కమ్మ పడుతున్న యాతన చూస్తుంటే ఇరుగు పొరుగులకి గుండెలు కదులు తున్నాయి.




కెంచు చిన్నన్న, కార్టూనిస్ట్, పోస్ట్:చిన్నమెట్‌పల్లి, మం:కోరుట్ల, జిల్లా: కరీంనగర్.

చుక్కమ్మకి కొడుకు తప్పించి 'నా' అన్న వాళ్ళు లేరు.

మంచంలో పడి ఉన్న చుక్కమ్మ స్థితి ఘోరంగా ఉంది. ఆ బతుక్కంటే చావు నయమనిపిస్తుంది. పోనీ డాక్టరు 'ప్రాణంపోయినట్లే' అని చెప్పాడు కదా. తామే దహనం చెయ్యటమో సమాధి చెయ్యటమో చేద్దామంటే భయంగా ఉంది.

తీరా అంతా అయ్యాక కొడుకొచ్చి బతికుండగానే అదీ నేను రాకుండా మా అమ్మని ఎందుకు దహనం చేశారు? అని అడిగితే ఏం చెప్పాలి? అని భయపడు తున్నారు.

చూస్తూ ఉండగానే మరో నాలుగు రోజులు గడి చాయి.

మళ్ళీ డాక్టర్ని పిలిచారు. "మనిషిలో ప్రాణంలేదు. నాడి అందటంలేదు మహా అయితే ఇంకా కొన్ని గంటలు. ఆ తరువాత ఈ గురగుర శబ్దం కూడారాదు." అన్నాడు.

"సరే. కొడుకు వచ్చినా రాకున్నా ఆ గురగుర శబ్దం ఆగిపోయేదాకా మనమే కనిపెట్టుకుని చూద్దాం" అనుకున్నారు ఇరుగు పొరుగు.

ఒకే ఊరి వాళ్ళ మన్న మమకారం వాళ్ళది.

చుక్కమ్మ రోగంతో మంచం పట్టాక చెప్పింది.

'నా కొడుకుతప్పకుండా నన్ను చూడటానికి వస్తాడు. ఒకవేళ వాడు రాకపోయినా నా సందిగ పెట్టెలో ముంతలో డబ్బుంది. దాంతో నా పీనుగని వెళ్ళదీయండి. నా కొడుకు ఎప్పుడొచ్చినా సరే నా గుడిసె, ఇంటి వెనక జాగా నా కడుక్కే చెందుతుంది. వాడు ఎంత సంపాదించినా వాడి తండ్రి ఆస్తి వాడికే దక్కుతుంది." అని ఇరుగు పొరుగుకి చెప్పింది.

ఇరుగు పొరుగుకి నవ్వాలో ఏడవాలో తెలియ లేదు.

"ఇమానాల్లో తిరుగుతూ లక్షల మీద యాపారం చేసేటోడికి ఈ పూరి గుడిసె కావాల్సి వచ్చిందా? అదీ తల్లినే అక్కర్లేదు అనుకోబట్టే పెళ్ళి చేసుకున్నాక ఊర్లో కాలుపెట్టలేదు. ఈ ముసిల్దాని చాదస్తం గాని అనవసరంగా మంచి మందుకూడా తినకుండా రోగం ముదర పెట్టు కుంది. ఈ జాగా అమ్మి వైద్యం చేయించుకుంటే పోయే ది." అని విసుక్కున్నారు.

★ ★ ★


ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలు అవుతుంది.

సరిగ్గా ఆ సమయంలో తెల్లని అంబాసిడర్ మట్టిరోడ్డు మీద దుమ్ము రేపుకుంటూ ఊళ్ళోకి వచ్చింది.

ఎవరన్నా రాజకీయ నాయకులో లేక పోలీసు అధికారులో అని జనం అనుకునేలోగా ఆ కారు తిన్నగా చుక్కమ్మ గుడిసెముందుకి వచ్చి ఆగింది.

చుక్కమ్మ కొడుకుపట్నం నుంచి వచ్చాడన్న వార్త క్షణాల్లో ఊరంతా దావానలంలా పాకింది.

ఖరీదైన సూటూ బూటుతో మెడలో చారల టైతో



## విలన్ పాత్రలకైనా రెడీ : సోమయాజులు

శంకరా నాద శరీర... పాటవింటే చాలు శంకరాభరణం శంకరశాస్త్రి గుర్తుకొస్తాడు. శంకరశాస్త్రి గుర్తుకొస్తే జె.వి. సోమయాజులు గుర్తుకొస్తాడు. అంతగొప్పగా ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేసిన క్రెడిట్ సోమయాజులుది.

అంతటి నటనాపటిమ ఉన్న సోమయాజులుని చిత్రపరిశ్రమ నిర్లక్ష్యం చేస్తోంది. చేతిలో సినిమాలు ఉన్నట్లు లేదు. ఓ సందర్భంలో కలిసిన సోమయాజులుని "మీరెలాంటి పాత్రలు చేస్తార"ని అడిగితే "నటుడిగా అన్ని రకాల పాత్రలు పోషించాలని ఉంది. విలన్ పాత్రలకైనా రెడీ... ఒకే యిమేజ్‌కు కట్టుబడి ఉండడం నచ్చదు అని చెప్పారు సిన్సియర్‌గా. ఇలాంటి నటుడినా మనం నిర్లక్ష్యం చేస్తున్నది?

-సాకేత్

లుగా ఉన్న ఒక యువకుడు కారుదిగి- ముక్కుకి రుమాలు అడ్డం పెట్టుకుని- దిక్కులు చూడసాగాడు.

అప్పటికే కారుచుట్టూ ఆ గూడెం జనం ఆడామగా పిల్లాపాప గుమిగూడారు.

'ఇతగాడు చుక్కమ్మ కొడుకు వెంకట రమణే నా. ఎప్పుడో ఆడు సదువుకునే రోజుల్లో సూసినం. పాతికేళ్ళు గడిసిపోనాది. ఈడు గా ఎంకటిగాడేనా? గురుతుపడత లేనట్టుండాది."

చుక్కమ్మ గుడిసెకి ఎదరగా పాకలో ఉండే రంగయ్య తాత కుడిచేతిని దొప్పలా చేసి కళ్ళకి అడ్డం పెట్టుకుని, ఎడంచేత్తో ఊతకర్రని నేలకి తాటిస్తూ కారు దగ్గరికి వచ్చి ఆ యువకుడిని ఎగాదిగా చూస్తూ...

"ను...వ్...త...వ...ఉ. చుక్కమ్మ కొడుకు వెంకటి గాడివేనా బాబు' అన్నాడు సందేహంగా.

"ఏం చెపుతాడో?" అని చుట్టూ మూగిన జనం అంతా ఆసక్తిగా ఆ యువకుడి మీద దృష్టి నిలిపారు.

ఆ యువకుడు తల అడ్డంగా ఊపాడు.

"కాదండీ. నేను వెంకటరమణగారి పి.ఏ.ని నా పేరు చంద్రకాంత్."

అంతే!

అంతవరకు కలకలంతో ఉన్న ఆ ప్రదేశం ఒక్కసారి సూదిపడితే వినపడేటంత- నిశ్శబ్దంగా మారిపోయింది. అందరినోళ్ళు ఆశ్చర్యంతో తెరుచు కున్నాయ్.

ముందుగా ఆ ఆశ్చర్యం నుంచి తేరుకుంటు అన్నాడు రంగయ్య తాత.

"అట్టనా? మరి ఎంకటిగాడు ఎందుకు రాలేదు? తల్లి సావుబతుకుల్లో ఉందని తెల్వదా?"

"తెలుసండి."

"మరి ఇంకేంది?"

"ఆయన ప్రస్తుతం ఇండియాలో లేరండి. కంపెనీ పనిమీద విదేశాల్లో టూర్ ప్రోగ్రాంలో ఉన్నారు. వెళ్ళి ఇరవైరోజులైంది. ఇంకో నెలదాకా రారు. అయన తల్లికి సీరియస్‌గా ఉంధని మీరు పంపిన టెలిగ్రాంలు నేను తీసుకున్నాను. ఆ విషయం తెలుపుతూ రమణ గారికి ఫోన్‌లో చెప్పాను. ఎంత ప్రయత్నం చేసినా వెంటనే తను రాలేననీ కనీసం పదిరోజులు తప్పనిసరి గా పడుతుం దనీ, ఈలోగా నన్నువెళ్ళి చూసి రమ్మని ఫోన్‌లో చెప్పారు. జరగకూడనిది ఏదన్నా జరిగితే నన్ను దగ్గరుండి అన్నీ జరిపించమని కూడా చెప్పారు."

గుడిసెముందు మూగిన జనం కొయ్యబారి పొయ్యారు. కొద్దిసేపు ఎవ్వరి నోట మాట రాలేదు.

అందరి ముఖాల్లో రంగులు మారాయి.

కొడుకు కోసం చుక్కమ్మ ఎన్ని ఆశలు పెట్టు కుంది? ఎంత రెక్కల కష్టం చేసింది? ఎన్నికలలు కంది? కొడుకు కొడుకని ఎంత తపించింది.

"ఆడా నా కొడుకు. ఇప్పుడు నన్ను సూట్టానికి రాకపోయినా నేను దిగులతో మంచం పట్టానని తెలిస్తే తప్పక వస్తాడు. పెళ్ళాం- డబ్బు- అంటూ మాయలో పడడు. ఆడికి నేనంటే పానం. ఆడి సేతుల మీదుగానే నా కట్టె కడతేరి పోవాల." అనేది చుక్కమ్మ.

అలాంటి చుక్కమ్మ ఇప్పుడు కొన ఊపిరితో మంచంలో ఉంది. ఆ జీవుడు కొడుకు కోసం కొట్టు కుంటోంది.


ఈ స్థితిలో కొడుకు రాలేదన్న వార్త భరించగలదా?

వచ్చింది కొడుకే అన్నా- కొడుకు కాదన్నా- ఆ ఆనందంగానీ దుఖఃగానీ భరించలేక చ్చిపోతుంది.

కాని కొడుకు రాలేదని తెలిస్తే ఆ ముసలిదాని ఆత్మక్షోభిస్తుంది. చచ్చిపోయినా నరకాన్ని చూస్తూ తీరని కోరికతో ఏ చెట్టుకో పుట్టకో వ్రేలాడుతూ ఉంటుంది.

అందరి ముఖాలు కలత బారాయి.

ముందుగా తేరుకుంటున్నట్లు రంగయ్య తాత "అట్లనా బాబూ తమరు మా చుక్కమ్మ కొడుకు ఎంకటిరమణ గాదన్న మాట. సరే... కానియ్యిబాబు సూడండ్రి... గావసారాలో నులక మం చంలో ఈగలు ముసురుతూ మూల్గుతూందే అదే మా ఎంకటిగాడి తల్లి చుక్కమ్మ. పది దినాలగ సావుకీ బతుక్కీ ఒడ్డున కొడుకుకోసం ఆ జీవుడు తన్నుక లాడుతుంది. ఇప్పుడు ఆడురాలేదని తెలిస్తే ఆ జీవుడు అల్లాడిపోతుంది. కంటి సూపు లేదూ. నోటి మాట లేదు. కాని ఆ ముసిల్దాని




కె.రవి ప్రసాద్, పోస్ట్:చెల్పూర్, మం:హుజురాబాద్, జిల్లా: కరీంనగర్.

ఏ సీమ దానవో...

సీరియల్

త్వరలో ప్రారంభం!

రచన

కిరణ్‌బాల

## ఎన్నికలు

రెండు గాడిదలు మాట్లాడుకుంటున్నాయి.

"ఈ ఎన్నికలలో ఫలానా పార్టీ గెలుస్తుందని బెట్ కాస్తున్నాను నువ్వేమంటావు?" అడిగిందొక గాడిద.

"గెలుస్తే నువ్వు గెలుస్తావు, లేకపోతే నేను గెలుస్తాను. అంతేకదా..." అంది రెండో గాడిద.

-పి.వి.మురళీ కృష్ణ
ఇ.నం.16-11-418/3/2,
ఆంధ్రా లా టైమ్స్ దగ్గర
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్-500 036.

మనసు మాత్రం కొడుకు కోసం తపించి పోతంది. అందుకని తమరు కాస్త పెద్దమనసు చేసుకుని దయతలచాలి. అలాగ ఎళ్ళి ఆ ముసలిదాని సెవి దగ్గర నోరు పెట్టి 'అమ్మా! నేను... నీ ఎంకటిని... నీ కొడుకు ఎంకటి రమణని పట్నం నుంచి వచ్చాను' అనుండ్రి. సాలు ఆ ముసలిదాని పానం సక్కబడు తుంది. తమరు ఓ అమ్మగన్న బిడ్డనే గందా?" అన్నాడు పెద్ద తరహాగా సలహా చెపుతున్నట్టు.

అంతవరకు ఆ ముసలిదాని కేసి ఏవగింపుగా చూస్తోన్న చంద్రకాంత్‌లో కాస్త కదలిక వచ్చింది.

అతనికి హఠాత్తుగా తల్లి జయమ్మ జ్ఞాపకం వచ్చింది.

సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రితం జయమ్మ ఆఖరి గడియలు లెక్కపెడుతూ మంచంలో ఉంది. అప్పుడు చంద్రకాంత్ దగ్గరలేడు. ఆవిడ కొడుకు కోసం కలవరించి కలవరించి కన్ను మూసింది.

ఆ సమయంలో చంద్రకాంత్ బాస్‌తో సింగపూర్ లో ఉన్నాడు. హోటల్సు మారడం వల్ల వాళ్ళు పంపిన తంతి సకాలంలో అందలేదు. వార్త తెలిసి అతను వచ్చేసరికి తల్లి బూడిదగానే దర్శనం ఇచ్చింది.

ఇప్పుడా మంచంలో ఉన్న చుక్కమ్మని చూస్తే చంద్రకాంత్ కళ్ళముందు తల్లి కదిలింది.

అనిర్వచనీయమైన మాతృ ప్రేమ అతని నరనరాన ఉప్పొంగి అంతవరకు ముక్కుదగ్గర అదిమిని సెంటెడ్ రుమాలు తీసేసి ఈగలు తన మీద వాలకుండా విసురుకుంటోన్న చేతిలోని న్యూస్ పేపర్ పక్కనే పడేసి గభాల్న చుక్కమ్మ మంచం దగ్గరకి వెళ్ళాడు

ఎవరో రాగిచెంబులో తులసి నీళ్ళు అందించారు.

చంద్రకాంత్ మంచం పిట్టమీద కూర్చుని తెరుచుకున్న చుక్కమ్మ నోట్లో తులసి నీళ్ళు పోసి ఆవిడ చెవి దగ్గర నోరుపెట్టి- "అమ్మా! అ...మ్మా... ఓ... అమ్మోయ్... నేను.. వెంకటిని... నీ వెంకటి రమణని వచ్చాను." అన్నాడు.

చుక్కమ్మలో చలనంలేదు.

"ఇంకో రెండు మూడు సార్లు గట్టనే పిలువు బాబు. ఆ ముసల్దాని జీవుడు ఏ లోకాల్లో తన్నుకు తాడతోందో?' ' అన్నాడు రంగయ్య తాత.

చంద్రకాంత్ వాళ్ళ మళ్ళీ నోరు చుక్కమ్మ చెవిదగ్గర పెట్టి "అమ్మా... ఓ అమ్మోయ్. నేను... నీ వెంకటి రమణని వచ్చాను." అన్నాడు.

ఈసారి అతని నోటి మాట పూర్తికాకముందే... "హా.. ' అన్నశబ్దం తుపాకి పేల్చినట్టు తెరిచి ఉన్న చుక్కమ్మ నోట్లోంచి గట్టిగా బయటకి తన్నుకు వచ్చింది.

నోటినిండా ఉన్న తులసినీళ్ళు లటుక్కున గొంతు లోకి జారాయి.

అరక్షణం చుక్కమ్మ కళ్ళు పూర్తిగా తెరుచు కున్నాయి.

ఎదురుగా దొరబాబులా ఉన్న వ్యక్తిని తృప్తిగా చూపులతో తడుముతూ "అమ్మా! నేను నీ ఎంకటిని..." అన్న పిలుపుకి పరవశిస్తున్నట్లు ఏవో అవ్యక్తాను రాగాలు... గాజు గోళాల్లాంటి ఆకళ్ళనిండా... రెప్ప పాటు కాలం.

అంతే!

మరుక్షణం ఆ కళ్ళు శాశ్వతంగా మూతలు పడి తల పక్కకి వాలిపోయింది. అంతవరకు చుక్కమ్మ గొంతు లోంచి వచ్చిన గురగురశబ్దం ఆగిపోయింది. చుట్టూ మూగిన జనం కొయ్యబొమ్మలే అయ్యారు.

పదిరోజులపైగా గొంతు తెగిన కోడిలా మూల్గుతూ పడిఉంది. ఎంతమంది పిలిచినా ఉలుకూ పలుకూ లేదు. నీ కొడుకు వచ్చాడన్నా "ఊ" అనలేదు. అలాంటిది "నీ కొడుకుని పట్నం నుండి వచ్చాను" అని చంద్రకాంత్ అనగానే అదే భ్రమలో ఉన్న చుక్కమ్మ క్షణంలో ఆ వ్యామోహం నుంచి బయట పడింది.

ఎంత చిత్రం?

చదువూ నాగరికతా తెలియని ఆ అమాయకపు పల్లెటూరి జనం తనని ఒక దేముణ్ణి చూసినట్లు చూస్తూంటే చంద్రకాంత్ మనసు చల్లగా అయ్యింది. కళ్ళనిండా నీళ్ళు ఊరాయ్.

"గోవిందా... గోవిందా..." అంటూ నల్గురూ చేరి చుక్కమ్మ శవాన్ని మంచం మీంచి కిందికి దింపుతుంటే అప్రయత్నంగా తనూ ఒక చెయ్యివేశాడు కొడుకుగాని కొడుకు చంద్రకాంత్.

★

కె. కమల
ప్లాట్ నం. 15,
బ్యాంక్ కాలనీ, లలితానగర్,
జామ్మైఉస్మానియా రైల్వేస్టేషన్,
హైదరాబాదు - 44.